క్లుప్తంగా

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు సత్కారం



ఎమ్మెల్సీను సత్కరించిన రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి నరేష్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడైన కుడుపూడి సూర్యనారాయణరావు ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైనందున బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు సత్కరించారు. స్థానిక అసోసియేషన్ భవనంలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ ఎమ్మెల్సీని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి డి.బాబి, కార్యదర్శి బడుగు జోగేష్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్యారమ్స్, చెస్, క్రికెట్ పోటీల్లో విజేతలైన న్యాయవాదులకు జిల్లా న్యాయమూర్తి నరేష్, ఎమ్మెల్సీ సూర్యనాయణరావులు బహుమతులు అందజేశారు.

ఇసుక లారీల అడ్డగింత

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు కడదారి నుంచి అక్రమంగా దిండు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను గెద్దాడవారి పాలానికి చెందిన గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. ఇసుకని అక్రమంగా తరలిస్తున్న లారీ డ్రైవర్లని నిలదీసి, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అక్రమ ఇసుక రవాణాపై తహసీల్దార్ సాంబశివప్రసాద్‌ని వివరణ కోరగా రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా ఉంచుతామని ఆయన తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన కల్యాణ చక్రవర్తికి చికిత్స చేస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్: తేనెటీగల దాడిలో అమలాపురం అబ్బిరెడ్డి వీధికి చెందిన అబ్బిరెడ్డి కల్యాణ చక్రవర్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన 216 బైపాస్ రోడ్డుకు వెళుతున్న సమయంలో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబసభ్యులు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందాలని అతడికి వైద్యులు సూచించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



భీమభక్తునిపాలెం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్: రూ.3 లక్షల గడప గడపకూ నిధులతో నిర్మించనున్న మండలంలోని భీమభక్తునిపాలెం సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ దాసరి అరుణ శంకుస్థాపన చేశారు. మంగళవారం ఆమె కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, దొంగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ర్యాలీ



ర్యాలీలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్‌లు ధరించి ద్విచక్రవాహనాలతో పురవీధుల్లో స్వాతంత్య్ర దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. మల్లాడి కృష్ణారావు ఇంటి నుంచి ఆయన అభిమానులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై బయలుదేరి జాతీయ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ వాహనచోదకులందరూ హెల్మెట్ ధరించాలని, ఆవిధంగా ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు.



జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



గొల్లవిల్లి జెడ్పీ పాఠశాలలో జెండా వందనం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు



ఐ.పోలవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో ఎంపీపీ మిరియం జ్యోతి



గురుకుల పాఠశాలలో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మది నిండా మువ్వన్నెల జెండా

- ఊరూరా ఘనంగా జరిగిన స్వాతంత్య్ర వేడుకలు
- మదిమదిలో ఉప్పొంగిన దేశభక్తి

స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఊరూరా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వేచ్ఛా వాయువుల కోసం తిరుగుబావుటా ఎగరేసిన చరితను గుర్తుచేసుకుంటూ మదిమదిలో దేశభక్తి ఉప్పొంగింది. పలు విద్యా సంస్థలు, వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు తమ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలు ఎగురవేసి దేశభక్తిని చాటారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలను ఆకర్షణీయంగా అలంకరించారు. త్రివర్ణాలను ప్రతిబింబించే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనేకచోట్ల చిన్నారులు జాతీయ జెండాలను చేతబూని సందడి చేశారు.



ముమ్మిడివరం ఎంపీడీఓ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



యానాంలో జాతీయ జెండాను ఎగురవేసిన మంత్రి లక్ష్మీనారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే అశోక్



అమలాపురంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



తాళ్లరేవులో జెండాను ఎగురవేసిన ఎంపీపీ రాయుడు సునీత



జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీధర్

ముమ్మిడివరం: భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం నియోజవర్గంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామన్నారు. భారతదేశంలో పుట్టడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు. ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, సీఐలు, ఎస్ఐలు జెండా వందనం చేశారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో, శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద, సర్ సీవీ రామన్ స్కూలు ఆవరణలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు జాతీయ జెండాలు ఎగురవేశారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విద్యుత్ నగర్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఆవిష్కరించారు. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు.

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో 77వ స్వాతంత్య్ర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మువ్వెన్నల జెండాను ఆవిష్కరించారు. అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీను నాయక్ జాతీయ జెండాను ఎగురువేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీడీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల పరిషత్ కార్యాలయం, భీమనపల్లి, ఉప్పలగుప్తం, ఎస్.యానం పీహెచ్‌సీల్లో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, పీఎంసీ చైర్మన్ రమావెంకటరమణలు జెండా ఎగురవేశారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఆకుల నవ్యశ్రీ, చాగంటి సత్యబిందు, నల్లా లక్ష్మీనారాయణలకు బహుమతులను అందజేశారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజులు జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఝాన్సీకుమారి, పాతయింజరం పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఎస్.రాజేష్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు.

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో శాశ్వత ప్రాతిపదికన రహదారుల నిర్మాణంతో పాటు డ్రైనేజీలను ఆధునీకరించనున్నట్లు పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక బాలయోగి స్టేడియంలో 77వ స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌తో కలిసి శాంతి కపోతాలు, రంగురంగుల బెలూన్లను ఆకాశంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెలలో జిప్‌మెర్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్థానిక మండల పరిషత్, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌ల వద్ద ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ టి.శ్రీనివాస్‌లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. కందికుప్ప పీఏసీఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కుండలేశ్వరంలో కుండలేశ్వరస్వామిని పూలు, పత్రాలతో జాతీయ పతాకం రంగులు వచ్చేలా అలంకరించారు.

అమలాపురం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పల్లవి జాతీయ జెండాను ఎగురవేశారు. కామనగరువులో జెడ్పీటీసీ ఉన్నత పాఠశాల వద్ద జెడ్పీటీసీ పందిరి శ్రీహరి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉత్తమ విద్యార్థులను సత్కరించారు.

తాళ్లరేవు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ రాయుడు సునీత జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ పాల్గొన్నారు.



ఎస్.యానాంలో అమృత్‌సరోవర్ వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ జానకి

ఎందరో మహనీయుల త్యాగ ఫలమిది

అల్లవరం: ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగానే మనకు స్వాతంత్య్రం లభించిందని ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్ళమూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాయుడు విష్ణు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్య్ర వేడుకలకు ఎంపీ అనురాధ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అల్లవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై జెండా వందనం చేశారు.



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాట్లాడుతున్న ఎంపీ చింతా అనురాధ

మంత్రి విశ్వరూప్ వెంటే మేమంతా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లవరం: మండలంలోని వైఎస్సార్ సీపీకి చెందిన ముఖ్య నాయకులందరం మంత్రి విశ్వరూప్ వెంటే ఉన్నామని, మంత్రి పట్ల తమకు ఎలాంటి అసంతృప్తి లేదని సీనియర్ నాయకులు మెరికల శ్రీను, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకట రామరాజు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు తదితరులు అల్లవరంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 13వ తేదీన గుడ్డివానిచింత వద్ద జరిగిన సమావేశంలో మండలానికి చెందిన ఇద్దరు స్థానిక నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ మాత్రమే వ్యాఖ్యానించారన్నారు. ఆ రోజు జరిగిన సమావేశంలో మంత్రి విశ్వరూప్ ప్రస్తావనే రాలేదని, అయితే మంత్రిని టార్గెట్ చేస్తూ తప్పుడు కథనాలు సృష్టించారన్నారు. మీడియాలో వచ్చిన తప్పుడు కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి విశ్వరూప్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టంచేశారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు పల్లి జేమ్స్‌రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బొక్కా శ్రీను, గుత్తుల రాజు, చెల్లుబోయిన రమేష్, సాపే ధర్మరాజు, కర్రి శ్రీను, జాన్‌తాతారావు, బొంతు శ్రీను, బళ్ల కమల్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

సైనికుడికి ఘన సత్కారం



సైనికుడు రవిబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి లక్ష్మీనారాయణ

యానాం: భారత సైన్యంలో పనిచేసి ఇటీవల వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న దరియాలతిప్ప గ్రామానికి చెందిన కూరాటి రవిబాబును పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో రవిబాబుకు జ్ఞాపికను అందజేశారు.

జీతం పెంపుదలపై హర్షం

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ముమ్మిడివరం: గ్రామీణ పేదరిక సంస్థ(సెర్ప్) ద్వారా డ్వాక్రా సంఘాల్లో పనిచేస్తున్న సీసీ స్థాయి నుంచి ప్రాజెక్టు మేనేజర్ వరకూ ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం జీతం పెంచడంపై డీఆర్‌డీఏ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ముమ్మిడివరం పీడీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ ఉద్యోగుల పనితీరును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీతాలు పెంచిందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకరప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ జిలాని, డీపీఎం విజయ్‌కుమార్, ఐబీ యాంకర్ విజయకుమారి, జేఏసీ ప్రెసిడెంట్ డి.వరాల బాబు, ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీఆర్‌డీఏ ఉద్యోగులు

మాజీ సర్పంచ్ మృతి

ఐ.పోలవరం: మండలంలోని గుత్తినదీవి మాజీ సర్పంచ్ సాధనాల బాబూరావు(79) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, చెల్లి వివేకానంద, మాజీ ఎంపీపీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు సంతాపం తెలిపారు.

చిక్కిపోతున్న పంట కాలువలు



ఉప్పలగుప్తంలో ఆక్రమణకు గురవుతున్న పెద్దూరు బ్రాంచ్ కెనాల్



ఉప్పలగుప్తం పంట కాలువపై ఏర్పాటు చేసిన వలకట్లు

ఉప్పలగుప్తం: మండలంలోని పలు చోట్ల పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. మండలంలోని ఐనాపురం–ఉప్పలగుప్తం సెక్షన్ కాలువ నుంచి విడిపోయి కామరాజుపేట, బొంతువారిపాలెంకు వెళ్లే బ్రాంచ్ కాలువ ఆక్రమణకు గురై దిగువ ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో రావటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా ఐనాపురం–ఉప్పలగుప్తం సెక్షన్ పేరాయిచెరువు చివరి ఆయకట్టుకు ప్రవహించే పంట కాలువపై పొడవునా అధిక సంఖ్యలో వలకట్లు ఉన్నాయని వాపోతున్నారు. మరోవైపు సాగునీరందే పంట కాలువల్లో వలకట్లు ఏర్పాటుచేయడంతో వాటి వద్ద పూడిక అధిక మొత్తంలో మేటలు వేస్తున్నాయి. దీంతో కాలువలు కుచించుకుపోయి దిగువ ప్రాంతాలకు సాగునీరందడం లేదు.

శెట్టిబలిజలంతా సంఘటితం కావాలి

ఉప్పలగుప్తం: కొన్ని రాజకీయ పార్టీలు శెటిబలిజ కులస్తులను విభజించి పాలిస్తున్నాయని, రాజ్యాధికారం దిశగా ఎదగాలంటే సామాజిక వర్గీయులంతా సంఘటితం కావాలని శెట్టిబలిజ యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలో ఎస్.కొత్తపల్లి గ్రామంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో సామాజిక వర్గీయులతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశానికి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప్పలగుప్తం మండలం శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా విత్తనాల సత్యనారాయణమూర్తిని ఏకగ్రీవకంగా నియమించుకున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు







జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఆర్మ్‌డ్ రిజర్వుడు డీఎస్పీ విజయసారథి, ఎస్ఈబీ సీఐ శివరామరాజు, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఆర్టీసీ ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎన్.వరహలబాబులు, ఐ.పోలవరం ఎంపీడీఓ రాంబాబు

అమలాపురం టౌన్/అల్లవరం/తాళ్లరేవు/ఐ.పోలవరం/అమలాపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులకు పురస్కారాలు అందజేశారు. స్థానిక బాలయోగి స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల వేదికపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ల చేతుల మీదుగా అవార్డులిచ్చారు. అమలాపురం ఆర్మ్‌డ్ రిజర్వుడు డీఎస్పీ పి.విజయసారథి, ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. అల్లవరం తహసీల్దార్ సాంబశివప్రసాద్, తాళ్లరేవు తహసీల్దార్ పోతురాజులకు ఉత్తమ తహసీల్దార్లుగా పురస్కారాలు లభించాయి. జగనన్న సురక్ష పథకంలో చురుకుగా పనిచేసినందుకు గాను ఐ.పోలవరం ఎంపీడీఓ డి.రాంబాబు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. అమలాపురం మండలానికి చెందిన విద్యుత్‌శాఖ ఏఈ హరిబాబు, వన్నెచింతలపూడి వీఆర్వో రాజేష్, ఆర్టీసీ ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎన్.వరహాలబాబులు, తాళ్లరేవు కమ్యూనిటీహెల్త్‌సెంటర్ సూపరింటెండెంట్ శిరీష, వీఆర్ఓ కాలా సత్యనారాయణలు సైతం ఉత్తమ అవార్డులు అందుకున్నారు. వీరిని పలువురు వివిధ శాఖల మండల అధికారులు అభినందించారు.



మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తాళ్లరేవు తహసీల్దార్ పోతురాజు